సాక్షి
తూర్పుగోదావరి
బుధవారం । 10 । సెప్టెంబర్ । 2025



అన్నదాన పథకానికి రూ.రెండు లక్షలు

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి చింతల అప్పలనాయుడు, మురళీకృష్ణ, ధనలక్ష్మి, రామకృష్ణ, మాధురి (విశాఖపట్నం) రూ.రెండు లక్షల విరాళాన్ని మంగళవారం అందజేశారు.




ముగ్గురు దారి దోపిడీ దొంగల అరెస్టు

కె.గంగవరం మండలం అద్దంపల్లి సమీపంలో ఈనెల 3న దారి దోపిడీకి పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ ఎం.వెంకట నారాయణ వెల్లడించారు.

8లో

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం రాత్రి 3,96,603 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.60 అడుగులకు చేరుకుంది. డెల్టా కాలువలకు 14,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

జీజీహెచ్‌లో ఎన్‌ఐసీయూ ఏర్పాటు చేయాలి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో నవజాత శిశువుల ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎన్‌ఐసీయూ) ఏర్పాటు చేయాలని కలెక్టర్ పి. ప్రశాంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జీజీహెచ్ అధికారులతో సమావేశమై కొత్త విభాగాల ఏర్పాటు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశుధ్య పరిరక్షణ వంటి అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జీజీహెచ్ లేఅవుట్ మాస్టర్ ప్లాన్ ప్రకారం ఆసుపత్రి ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద ఆర్చ్ నిర్మించాలన్నారు. ఆసుపత్రికి ఒకటి, రెండు మాత్రమే ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మిగిలిన మార్గాలను బారికేడ్లు వేసి మూసివేయాలని సూచించారు. అవుట్ పేషెంట్ సేవలు సమయానికి ప్రారంభమయ్యేలా టోకెన్ కౌంటర్లు పెంచాలన్నారు. న్యూరో సర్జరీ విభాగానికి అవసరమైన పరికరాలు అందుబాటులో ఉన్నందున తాత్కాలికంగా సాంకేతిక నిపుణులను నియమించి, ఆ మేరకు సేవలు అందుబాటులోకి తీసుకుని రావాలని సూచించారు. సీఎస్‌ఆర్ నిధులతో ఎన్‌ఐసీయూ పరికరాలను అందిస్తామని, త్వరలో సేవలు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మృతదేహాలను తరలించడానికి మహా ప్రస్థానం వాహనాలతో పాటు ప్రైవేటు వాహనాలను కూడా ఎంపానెల్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వైద్య అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ బి. సౌభాగ్య లక్ష్మి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కే.భాస్కర్‌రెడ్డి, జీజీహెచ్ ఆర్ ఎం డాక్టర్ ఆర్ వీ సుబ్బారావు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో పోలీసులకే రక్షణ కరవు



మాజీ ఎంపీ భరత్

రాజమహేంద్రవరం సిటీ: ఆదివారం అర్ధరాత్రి నగరంలో జరిగిన ఘటన చూస్తుంటే, అసలు రక్షక భటులకే రక్షణ కరవైనట్టు అర్థమైందని, ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ ప్రశ్నించారు. మంగళవారం రాజమహేంద్రవరంలో వైఎస్సార్ సీపీ సిటీ కార్యాలయంలో మాట్లాడుతూ పోలీసులపై దాడికి దిగిన ఘటనకు సంబంధించిన వీడియో వైరల్ అయిందన్నారు. కోటిపల్లి బస్టాండ్ నుంచి మెయిన్‌రోడ్డు వరకు తప్పతాగిన యువకులు సృష్టించిన బీభత్సానికి బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. బ్లేడ్ బ్యాచ్‌లను అరికడతామని చెప్పే ఈవీఎం ఎమ్మెల్యే ఈ ఘటనకు ఏం సమాధానం చెబుతారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక స్థానికంగానే ఎమ్మెల్యేల అనుచరులు యథేచ్ఛగా భూ సెటిల్‌మెంట్‌లు చేస్తున్నారని భరత్‌రామ్ ఆరోపించారు. అధికార పార్టీకి వంత పాడే చానల్స్‌లోనే ఈ కథనాలు వస్తున్నాయని ఆయన గుర్తుచేశారు. మొన్న నగర నడిబొడ్డున కుమారి టాకీస్ సమీపంలో భూ కబ్జాకు దిగిన ఘటన జరిగిందన్నారు. అసలు ఇలాంటి వాళ్లను పెంచి పోషించేదెవరని ఆయన నిలదీశారు. రాజకీయ అండదండలు లేకుండా పోలీసులపై దాడికి దిగే సాహసం ఎవరు చేస్తారన్నారు. ఇలాంటి వారిని గుర్తించి, రౌడీ షీట్లు ఎందుకు తెరవడం లేదని, నగర బహిష్కరణ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. ఈ పాపాలు, ఘోరాలకు కారణం నేటి పాలకులే అనటంలో సందేహమే లేదని ఆయన పేర్కొన్నారు. పాలనను సంస్కరించుకోకపోతే అత్యంత ప్రమాద స్థాయికి చేరుకుంటామని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

అరుణాచలం యాత్రకు ప్రత్యేక బస్సు



యాత్రకు బయలు దేరిన ప్రత్యేక బస్సు

రాజమహేంద్రవరం సిటీ: అరుణాచలం, రామేశ్వరం యాత్రకు రాజమహేంద్రవరం డిపో నుంచి మంగళవారం స్టార్ లైనర్ నాన్ ఏసీ స్లీపర్ బస్సు 30 మంది భక్తులతో బయలుదేరి వెళ్లిందని డిపో మేనేజర్ మాధవ్ తెలిపారు. ఈ యాత్రలో 9 రోజులపాటు కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, పళని, కోయంబత్తూర్, కుంభకోణం, చిదంబరం, గురువాయూర్, త్రివేంద్రం, కన్యాకుమారి, మధురై, రామేశ్వరం, శ్రీరంగం, తంజావూరు వంటి 14 పుణ్యక్షేత్రాలు దర్శించుకొని తిరిగి 18వ తేదీ రాజమహేంద్రవరం డిపోకు చేరుకుంటుందన్నారు.



కొవ్వూరులో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు తానేటి వనిత, తలారి వెంకట్రావ్, జి.శ్రీనివాసనాయుడు



రాజమహేంద్రవరంలో మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఇంటి వద్ద నుంచి అన్నదాత పోరు కార్యక్రమానికి వెళ్తున్న మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, సత్తి సూర్యనారాయణరెడ్డి , రాజమహేంద్రవరం పార్లమెంటరీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్

ఉద్యమంపై ఉక్రోషం!

- రైతులకు అండగా ఆందోళన చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులపై పోలీసుల జులుం
- యూరియా, ఎరువుల కొరతపై అధికారులకు విన్నవించేందుకు నేతల సమాయత్తం
- ముందుకు కదలకుండా అడుగడుగునా అడ్డుకున్న పోలీసులు
- సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లకుండా నిలువరించిన వైనం
- నిరసనగా రోడ్డుపై బైఠాయించి రెండు గంటలు ధర్నాకు దిగిన వైఎస్సార్ సీపీ నేతలు
- కొవ్వూరులో ఆంక్షలను అధిగమించి ఆర్డీఓ కార్యాలయానికి చేరుకున్న పార్టీ నేతలు
- డిమాండ్లపై ఆర్డీఓకు వినతి పత్రం



పోలీసుల వైఖరికి నిరసనగా రోడ్డు మీద ధర్నా చేస్తున్న నాయకులు

సాక్షి, రాజమహేంద్రవరం: అన్నదాతలకు అండగా చేపడుతున్న ఉద్యమంపై కూటమి ప్రభుత్వ నేతృత్వంలోని పోలీసులు ఉక్రోషం ప్రదర్శించారు. కర్షకుడి కష్టాలు కూటమి పాలకులు, అధికారుల కళ్లకు కట్టేందుకు సమాయత్తమవుతున్న ఉద్యమకారుల గొంతు నొక్కారు. యూరియా, ఎరువుల కొరత అరికట్టాలని, రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్డీఓ కార్యాలయానికి వెళుతున్న వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, రైతులపై ఆంక్షలు విధించారు. కార్యాలయం వద్దకు వెళ్లేందుకు వీలులేదంటూ ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. నేతల ఇళ్లవద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి మరీ బయటకు రాకుండా నిలువరించారు. కొందరు పోలీసులైతే అత్యుత్సాహం ప్రదర్శించారు. నిరసన కార్యక్రమానికి వెళ్లవద్దంటూ ముందురోజు నేతలకు ఆదేశాలు జారీ చేశారు. మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి కార్యకర్తలు ఎవరూ రాకుండా నిలువరించారు. కనీసం వినతి పత్రం ఇచ్చేందుకు సైతం అనుమతించలేదంటే రాష్ట్రంలో ఎలాంటి రాజ్యాంగం నడుస్తోందో అద్దం పడుతోంది. కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును చూస్తుంటే ప్రజాస్వామ్యం బతికుందా? అన్న అనుమానం కలుగుతోందని ప్రజలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాజమహేంద్రవరంలో ఉద్రిక్తం

యూరియా, ఎరువుల కొరతను తక్షణం నివారించాలని, రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు వైఎస్సార్ సీపీ నేతలు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. యూరియా, ఎరువుల కొరతపై సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు, రైతులు సమాయత్తమయ్యారు. రాజమహేంద్రవరం ప్రకాష్ నగర్‌లోని జక్కంపూడి రాజా గృహం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వద్దకు పెద్ద ఎత్తున ర్యాలీగా వెళుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులను, నాయకులను పోలీసులు అక్కడే అడ్డుకున్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయం వద్దకు వెళ్లేందుకు అనుమతి లేదని వారించారు. అక్కడికి వెళ్లనిచ్చేది లేదంటూ పెద్ద ఎత్తున బారికేడ్లు ఏర్పాటు చేశారు. భారీ స్థాయిలో పోలీసులను మోహరించారు. అడుగడుగునా అడ్డంకులు సృష్టించారు. అక్కడి నుంచి కదలకుండా అష్ట దిగ్బంధనం చేశారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు ఎంత సర్దిచెప్పినా వినకుండా అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, వైఎస్సార్ సీపీ నేతల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అయినా వినకుండా పోలీసులు నేతలు, రైతులను అక్కడే నిలువరించారు. దీంతో ఆగ్రహించిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, అనపర్తి ఇన్‌చార్జి సత్తిసూర్యనారాయణరెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు (పార్లమెంట్) చందన నాగేశ్వర్, గుబ్బల తులసీకుమార్, నక్కా నగేష్, రైతులు అక్కడే బైఠాయించారు. ఎర్రటి ఎండలో సుమారు రెండు గంటల పాటు రోడ్డుపై కూర్చొని ధర్నా నిర్వహించారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. కూటమి వ్యవహరిస్తున్న తీరుపై నిప్పులు చెరిగారు. తక్షణం రాష్ట్రంలో యూరియా కొరతను నివారించాలని, రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో క్రిష్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రెవ.విజయసారథి, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి అంగాడి సత్యప్రియ పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయం దిగ్బంధం

వైఎస్సార్ సీపీ శ్రేణులు సబ్ కలెక్టర్ కార్యాలయానికి వినతి పత్రం ఇచ్చేందుకు వస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న పోలీసులు ముందస్తుగా అక్కడికి చేరుకున్నారు. ఎవరూ రాకుండా కార్యాలయం నలువైపులా అష్ట దిగ్బంధం చేశారు. నాలుగు వైపులా రహదారులను బంధించారు.



రాజమహేంద్రవరంలో మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఇంటి వద్ద పోలీసుల పహారా



మాజీ మంత్రి వేణు, మాజీ ఎమ్మెల్యేలు రాజా, సూర్యనారాయణరెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు

కొవ్వూరులో సక్సెస్

కొవ్వూరు డివిజన్‌లో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహించిన 'అన్నదాత పోరు' కార్యక్రమం విజయవంతమైంది. పోలీసులు ఎన్ని ఆంక్షలు పెట్టినా, తక్కువ మంది మాత్రమే కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశాలిచ్చినా, వాటిని లెక్క చేయకుండా వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, శ్రేణులు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు నియోజకవర్గాల పరిధిలోని అన్ని మండలాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చారు. తొలుత నాయకులు, కార్యకర్తలు కొవ్వూరు మెరక వీధి వాటర్ ట్యాంక్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి ఆయా నియోజకవర్గ ఇన్‌చార్జిలు, మాజీ ఎమ్మెల్యేలు తానేటి వనిత, తలారి వెంకట్రావు, గెద్దం శ్రీనివాస్ నాయుడుల ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లారు. ర్యాలీ బస్టాండ్ సెంటర్, విజయవిహార్ సెంటర్, ఎల్ఐసీ ఆఫీస్ మీదుగా ఆర్డీఓ కార్యాలయం వరకు సాగింది. అందరికీ అనుమతి లేదని పోలీసులు ఆంక్షలు విధించారు. కేవలం 50 మంది ఆర్డీఓ కార్యాలయంలోకి అనుమతిస్తామని పోలీసులు అడ్డుకున్నారు. అందరినీ పంపించాలని ఎంత వాదించినా ససేమిరా అనడంతో వైఎస్సార్ సీపీ నేతలు మిన్నకుండిపోయారు. అనంతరం రైతుల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీఓ కార్యాలయంలో ఏఓకు సమర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంతమని రమేష్, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, ఎంపీపీలు, మండల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతియుత ఉద్యమాలకు అనుమతులు ఇవ్వరా?

ప్రజల అవసరాలు తీర్చడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. గతంలో లేనివిధంగా రైతుల ఆత్మహత్యలకు ఈ ప్రభుత్వం కారణమవుతోంది. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మిర్చి, పొగాకు, మామిడి రైతుల సమస్యలను పరిశీలిస్తే తప్ప స్పందించని ప్రభుత్వమిది. సకాలంలో యూరియా ఇవ్వమంటే వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు బాధ్యతా రాహిత్యంగా మాట్లాడుతున్నారు. బ్లాక్ మార్కెట్‌కు యూరియా తరలుతున్నా నియంత్రించడం లేదు. శాంతియుతంగా వినతి పత్రం ఇవ్వాలని వెళుతుంటే అనుమతి లేదంటున్నారు. అనుమతులకు దరఖాస్తు చేసినా ఇవ్వలేదు. సీఎం చంద్రబాబు వరి సాగు చేయొద్దంటున్నారు. ఎరువులు సకాలంలో సరఫరా చేయాల్సిన బాధ్యత మీది కాదా?

– చెల్లుబోయిన వేణు, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

వ్యవసాయ రంగంపై చంద్రబాబుకు అక్కసు

సీఎం చంద్రబాబు పాలనలో ఎక్కువగా నష్టపోయేది రైతులే. అధికారంలో ఎప్పుడున్నా.. వ్యవసాయ రంగంపై చంద్రబాబు అక్కసు ప్రదర్శిస్తూనే ఉంటారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆర్బీకేల్లో రైతులకు అన్నీ అందేవి. కూటమి ప్రభుత్వం ఎరువులు కూడా ఇవ్వలేని దౌర్భాగ్య పరిస్థితుల్లో ఉంది. ఎరువులు తక్కువగా వాడండి అని సీఎం చంద్రబాబు సలహా ఇవ్వడం ఆయన చేతగానితనానికి నిదర్శనం. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సినిమా డైలాగులు పక్కన పెట్టి కనీస బాధ్యతగా ఎరువుల పంపిణీ చేసే బాధ్యత తీసుకోవాలి. రైతులు ప్రభుత్వంపై తిరగబడే రోజు దగ్గర్లోనే ఉంది. రైతులకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుంది.

– జక్కంపూడి రాజా, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు

యూరియా కొరతతో కష్టాలు

రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కోసం రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. క్రాప్ ఇన్సూరెన్స్, మద్దతు ధర లేకపోవడం, పంట నష్టపరిహారం ఇవ్వకపోవడంతో అల్లాడుతున్నారు. కనీసం ఎరువులు కూడా సక్రమంగా సరఫరా చేయలేని దౌర్భాగ్య స్థితితో కూటమి ప్రభుత్వం ఉండటం సిగ్గుచేటు. గత వైఎస్సార్ సీపీ హయాంలో రైతులకు ఎక్కడా చిన్న సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకుంది. తక్షణం యూరియా కొరతను నివారించాలి.

–డాక్టర్ గూడూరి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ రాజమండ్రి పార్లమెంట్ ఇన్‌చార్జి

అన్నదాత నడ్డి విరుస్తున్నారు

కూటమి ప్రభుత్వం రైతులకు మంచి చేయకపోగా అన్నదాత నడ్డి విరుస్తోంది. సకాలంలో యూరియా సరఫరా చేయకపోగా సీఎం చంద్రబాబు మాత్రం యూరియా ఎక్కువగా వినియోగించవద్దంటున్నారు. యూరియా ఎంత వాడాలో రైతులకు తెలియదా? సరఫరా చేయలేక టాపిక్ డైవర్ట్ చేసేందుకు నాటకాలకు తెర తీశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాం రైతులకు స్వర్ణయుగం.

–సత్తి సూర్యనారాయణరెడ్డి, అనపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి

తండ్రిని హత్య చేసిన కుమారుడికి రిమాండ్

కరప: మండలంలోని ఉప్పలంక గ్రామ శివారు మొండి వద్ద సోదరుడికి మందు తీసుకురమ్మని డబ్బు ఇవ్వగా మద్యం తాగి రావడంతో గొడవపడి తండ్రిని హత్యచేసిన కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కరప పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కరప మండలం మొండికి చెందిన కాలాడి సూర్యచంద్రరావుకు నలుగురు కుమారులు. భార్య క్యాన్సర్‌తో సుమారు మూడు సంవత్సరాల క్రితం మరణించింది. మూడో కొడుకు మహేష్ మానసిక రుగ్మతతో బాధపడుతున్నాడు. అతడికి ఫిట్స్ వస్తూ ఉంటాయి. రెండవ కొడుకు చంద్రశేఖర్ తన సోదరుడు మహేష్‌కు మందులు తీసుకురమ్మని 500 రూపాయలు తండ్రి సూర్యచంద్రరావుకి ఇచ్చి పంపించాడు. తండ్రి మందులు తీసుకురాకుండా ఆ సొమ్ముతో మద్యం తాగి వచ్చాడు. సూర్యచంద్రరావు తన రెండవ కొడుకు చంద్రశేఖర్‌తో గొడవపడ్డాడు. చంద్రశేఖర్ గొడ్డలితో తండ్రి సూర్యచంద్రరావుపై దాడి చేయడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈవిషయంపై సూర్యచంద్రరావు పెద్ద కొడుకు ధనుంజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప ఎస్ఐ కేసు నమోదు చేయగా దాన్ని కాకినాడ రూరల్ ఇన్‌స్పెక్టర్ డి.ఎస్. చైతన్య కృష్ణ దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు కాలాడి చంద్రశేఖర్‌ను సీఐ అరెస్ట్ చేసి మంగళవారం కోర్టుకు హాజరుపర్చగా అతనికి 14 రోజులు రిమాండ్ విధించారు

బాలికపై అత్యాచారం చేసిన యువకులను శిక్షించాలి



గోకవరంలో ఆందోళన నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ విజృంభణ సభ్యులు

గోకవరం: బాలికపై అత్యాచారం చేసిన యువకులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ విజృంభణ ఆధ్వర్యంలో మంగళవారం గోకవరంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి కె.సతీష్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన మాగాపు గాంధీ, టీడీపీ నాయకుడి అన్నయ్య కుమారుడు గునిపే కిరణ్ ప్రేమ పేరుతో బాలికపై అత్యాచారం చేశారన్నారు. అధికారం చేతిలో ఉందనే అహంతో, మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరనే గర్వంతో ఈ దుశ్చర్యలకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసి 24 గంటలు గడుస్తున్నా నిందితులను అరెస్టు చేయడంలో పోలీసులు విఫలమయ్యారని విమర్శించారు. తక్షణమే పోలీసులు, స్థానిక ఎమ్మెల్యే స్పందించి బాలిక, ఆమె తల్లిదండ్రులపై బెదిరింపులకు పాల్పడకుండా రక్షణ కల్పించాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలో బాలికకు న్యాయం జరగకపోతే ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

అభివృద్ధికి బ్రేక్.. ఉపాధికి షాక్..



ఇటీవల గ్యాస్ పైపులైన్ లీకేజీతో గొల్లపాలెంలో ఏర్పడిన గొయ్యి



రాజోలు దీవిలోని రోడ్లపై ఓఎన్జీసీ వాహనాల రాకపోకలు

- రాజోలు దీవిలో వంద ఆయిల్, గ్యాస్ బావులు
- ఉత్పత్తులను తరలిస్తున్న ఆయిల్ కంపెనీలు
- స్థానికులకు ప్రాధాన్యం కరువు
- బయటి వారికే పెద్దపీట
- యువతకు కొరవడిన ఉపాధి

మలికిపురం: రాజోలు దీవి నుంచి అపార చమురు, గ్యాస్ నిక్షేపాలను తరలించుకు పోతున్న ఓఎన్జీసీ, గెయిల్ సంస్థలు ఇక్కడ పారిశ్రామిక అభివృద్ధికి ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఫలితంగా ఈ ప్రాంతంలో నిరుద్యోగం తాండవం చేస్తోందన్నారు. నిక్షేపాలు అధికంగా ఉన్న చోట అభివృద్ధిని సాధించాల్సింది పోయి, యువత ఉపాధి కోల్పోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. వివరాల్లోకి వెళితే.. మలికిపురం, రాజోలు, సఖినేటిపల్లి మండలాల్లోని సుమారు 100 బావుల ద్వారా ప్రతి రోజూ 20 లక్షల క్యూబిక్ మీటర్ల గ్యాస్, అదే స్థాయిలో చమురు నిక్షేపాలను ఓఎన్జీసీ, గెయిల్ తరలించుకుపోతున్నాయి. కానీ ఈ సంస్థలు ఈ ప్రాంతాల ప్రజలకు ఉపాధి చూపడంపై పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నాయి. ఈ సంస్థల్లో ఇక్కడి వారికి సరైన ఉద్యోగాలు లేవు. ఆయా సంస్థల కార్యకలాపాల్లో కూడా సరియైన ప్రాధాన్యత ఇవ్వడం లేదు.

అనేక నష్టాలు

రాజోలు దీవిలో గ్యాస్, చమురు నిక్షేపాలను తరలించుకుపోవడంతో ఈ ప్రాంతం గుల్లవుతోంది. ఇక్కడి భూసారంతో పాటు పంటల దిగుబడులు తగ్గిపోతున్నాయి. అలాగే గ్యాస్‌ను తరలించే భారీ వాహనాల రాకపోకలతో రోడ్లు ధ్వంసమవుతున్నాయి. తరచూ పైపులైన్ల లీకేజీలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇంత నష్టం జరుగుతున్నా ఈ ప్రాంతంలో అభివృద్ధికి ఆయిల్ కంపెనీలు ప్రాధాన్యం ఇవ్వడం లేదు.

పరిశ్రమలకు దక్కని ప్రాధాన్యం

రాజోలు దీవిలో గతంలో పలు పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. వాటిలో తూర్పుపాలెంలో ఐస్ ఫ్యాక్టరీ, ఐరన్ ఫ్యాక్టరీ, అలాగే తూర్పుపాలెంతో పాటు కేశవదాసుపాలెంలో విద్యుత్ ఉత్పత్తి పరిశ్రమలను ఏర్పాటు చేశారు. అప్పట్లో వాటికి లోప్రెజర్ గ్యాస్‌ను తక్కువగా అందించేవారు. భవిష్యత్తులో గ్యాస్ మరింత అందిస్తారని, రాయితీ కూడా వస్తుందని నిర్వాహకులు ఆశించారు. అయితే రానురాను పరిస్థితి దిగజారింది. గ్యాస్ సరఫరాను పెంచలేదు, రాయితీ ఇవ్వలేదు సరికదా, అప్పటి వరకూ సరఫరా చేసిన గ్యాస్ ధరను అమాంతంగా పెంచేశాయి. దీంతో అసలే అంతంత మాత్రంగా నడుస్తున్న ఆయా పరిశ్రమలను యజమానులు మూసివేశారు. తూర్పుపాలెం ఐస్ ఫ్యాక్టరీతో పాటు, విద్యుత్, స్టీల్ పరిశ్రమలు, కేశవదాసుపాలెంలో విద్యుత్ ఉత్పత్తి పరిశ్రమ మూతబడ్డాయి. దీంతో నిర్వాహకులు రూ.కోట్లు నష్టపోయారు. స్థానిక యువత ఉపాధి లేక సతమతమవుతున్నారు. స్థానిక పరిశ్రమలకు రాయితీలు, గ్యాస్ సరఫరా చేయని ఆయా సంస్థలు.. ఇతర చోట్ల పరిశ్రమలకు ఇవ్వడం దారుణమైన అంశమని స్థానికులు మండిపడుతున్నారు. లోప్రెజర్ గ్యాస్‌ను తక్కువ ధరకు నియోజకవర్గంలో పరిశ్రమలకు అందించని ఒక సంస్థ.. ఇటీవల రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు కంపెనీకి శివకోడులోని ఓ బావిని ధారాదత్తం చేయడం గమనించదగ్గ విషయం.

వరస లీకేజీలు

రాజోలు దీవిలో వారానికోసారి గ్యాస్, ఆయిల్ బావులు లీకవుతాయి. ప్రజలు బెంబేలెత్తి, తీవ్ర భయాందోళనలు చెందుతారు. కానీ ఆయా సంస్థలు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తాయి. శిథిలమైన పైపులైన్లు, బావుల పరికరాలకు మరమ్మతులు చేయపోవడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. కనీసం ఓఎన్జీసీ కార్యకలాపాల పనులు, కాంట్రాక్టులు కూడా ఆయా సంస్థలో పరిచయం, పలుకుబడి ఉన్న ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల సంస్థలు, వ్యక్తులకే ఇస్తున్నారనే వాదన ఇక్కడ బలంగా ఉంది.

క్లుప్తంగా

రాజమహేంద్రవరం - కాకినాడ మధ్య స్పెషల్ రైళ్లు

రాజమహేంద్రవరం సిటీ: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రాజమహేంద్రవరం – కాకినాడ పోర్టు మధ్య ప్రతి రోజు అన్ రిజర్వ్డ్ ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ప్రకటించారు. కాకినాడ పోర్టు – రాజమహేంద్రవరం (07523) రైలు ఈ నెల 15 నుంచి, రాజమహేంద్రవరం – కాకినాడ పోర్టు (07524) రైలు ఈ నెల 16 నుంచి అందుబాటులోకి వస్తాయన్నారు. ఇవి రాజమహేంద్రవరం, ద్వారపూడి, అనపర్తి, బిక్కవోలు, మేడపాడు, సామర్లకోట, కాకినాడ టౌన్, కాకినాడ పోర్టు రైల్వే స్టేషన్లలో ఆగుతాయని వివరించారు. ఒక రైలు రాజమహేంద్రవరంలో తెల్లవారుజాము మూడు గంటలకు బయలుదేరి 4.40 గంటలకు కాకినాడ పోర్టు చేరుకుంటుందన్నారు. మరో రైలు కాకినాడలో ఉదయం 6.15 గంటలకు బయలుదేరి 8.15 గంటలకు రాజమహేంద్రవరం వస్తుందన్నారు.

పింక్ మూన్‌తో 'నన్నయ' ఒప్పందం


ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న అధికారులు

రాజానగరం: పింక్ మూన్ టెక్నాలజీ సంస్థతో ఆదికవి నన్నయ యూనివర్సిటీకి అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. దీనికి సంబంధించిన పత్రాలపై మంగళవారం వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, టెక్నాలజీ సంస్థ సీఈఓ టి.నాగమల్లేశ్వరరావు సంతకాలు చేసి, పరస్పరం మార్చుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా యూనివర్సిటీలోని అన్ని ఐటీ, సాఫ్ట్‌వేర్ ప్రక్రియలకు సాంకేతిక మద్దతు, కన్సల్టెన్సీ, పరిష్కారాలు అందిస్తుందన్నారు.

వివాహిత అదృశ్యం


జ్యోత్స్న (ఫైల్)

పెరవలి: ఖండవల్లి గ్రామానికి చెందిన వనచెర్ల రాంబాబు, లక్ష్మి దంపతుల కుమార్తె పెచ్చెట్టి జ్యోత్స్న (19) అదృశ్యమైంది. ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. జ్యోత్స్నకు ఈ ఏడాది ఏప్రిల్ 23న వివాహం జరిగింది. వినాయక చవితి పండగకు పుట్టింటికి వచ్చి, ఇక్కడే ఉంది. ఈ క్రమంలో ఈ నెల 8న తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లి, ఉదయం 11 గంటలకు ఇంటికి తిరిగి వచ్చారు. కానీ ఇంట్లో జ్యోత్స్న కనిపించలేదు. బంధువులు, చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా, ఫలితం లేకపోవడంతో ఆమె తల్లి.. పోలీసులను ఆశ్రయించారు. ఆమె ఆచూకీ తెలిసే 94407 96642కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

గాలికుంటు.. తరిమికొట్టు

- 15 నుంచి వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం
- జిల్లాకు చేరుకున్న 1.25 లక్షల డోసులు
- వర్షాకాలంలో వ్యాధి తీవ్రత ఎక్కువ



రాయవరం: గ్రామీణ ప్రాంతాల్లో పొలాలు దున్నాలన్నా, దుక్కి చేయాలన్నా ఎద్దులు, దున్నల అవసరం తప్పనిసరి. వీటితో పాటు పాడి పశువులు బాగుంటేనే పాడి పరిశ్రమ అభివృద్ధి చెందుతుంది. అయితే ఎద్దులు, దున్నలు, ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి (ఫుట్ అండ్ మౌత్ డిసీజ్) సోకే ప్రమాదం ఉంది. వైరస్ కారణంగా వచ్చే ఈ వ్యాధి ప్రభావం వర్షాకాలంలో అధికంగా ఉంటుంది. దీని బారిన పడిన పశువుల్లో ఉత్పాదకత తగ్గిపోతుంది. తద్వారా పశు పోషకులకు తీవ్రమైన ఆర్థిక నష్టం కలుగుతుంది. అయితే సరైన చికిత్సా విధానాలు పాటిస్తే పశువులు, జీవాలను ఈ వ్యాధి బారి నుంచి కాపాడుకోవచ్చని పశువైద్యులు సూచిస్తున్నారు. జిల్లాలో ఈనెల 15 నుంచి అక్టోబర్ 15 వరకూ గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించనున్నారు.


పాడి-పంట

జిల్లాలో పరిస్థితి

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1,65,368 పశువులు ఉన్నాయి. వీటికి 7వ రౌండ్ బూస్టర్ డోస్ ఈ నెల 15 నుంచి అక్టోబర్ 15 వరకూ ఉచితంగా వేయనున్నారు. అక్టోబర్ 15 నుంచి నెలాఖరు వరకు ఏడాది లోపు దూడలకు బూస్టర్ డోస్ వేస్తారు. జిల్లాకు 1.65 లక్షల డోసులు అవసరం కాగా, 1.25లక్షల డోసులు జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. గతంలో 40 వేల డోసుల నిల్వలు ఉన్నాయి.

టీకాలు తప్పనిసరి



"గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలి. పశువైద్యశాఖ ద్వారా ఈ నెల 15 నుంచి అక్టోబర్ 15 వరకూ జిల్లాలో ఉచితంగా వేయనున్నారు. వీటిని పశువులు, జీవాలకు తప్పనిసరిగా వేయించాలి."

– డాక్టర్ కె.వెంకట్రావు, డీఏహెచ్‌వో, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

వ్యాధి లక్షణాలు

- గాలిలో తేమ శాతం అధికంగా ఉన్నప్పుడు గాలికుంటు వ్యాధి వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ వ్యాధి సోకిన సమయంలో పశువుల్లో గర్భం విఫలమవుతుంది. వేడిని తట్టుకోలేవు.
- ఈ వ్యాధికి గురైన గేదె, మేక, గొర్రె వంటి జీవాల్లో తీవ్రమైన జ్వరం కనిపిస్తుంది. పాల దిగుబడి తగ్గడం, నోరు, మూతి, కాళ్లు, పొదుగు మీద పుండ్లు, బొబ్బలు కనపడటం, కాళ్లు కుంటడం, నోటి నుంచి విపరీతంగా నురగ కారడం వంటి లక్షణాలు ఉంటే గాలికుంటు వ్యాధి సోకినట్టు గుర్తించాలి.
- ఆగస్టు, సెప్టెంబర్, మార్చి, ఏప్రిల్ మాసాల్లో ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది. దీని వల్ల మరణాల శాతం తక్కువైనప్పటికీ పశువుల్లో ఉత్పాదక శక్తి సామర్థ్యం తగ్గుతుంది. జ్వరం తీవ్రత 104 నుంచి 106 డిగ్రీల ఫారన్ హీట్ వరకు పెరిగిన పశువులు నీరసిస్తాయి. పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుంది.
- నోటి ఎపిథీలియం (పైపొర), పళ్లు, చిగుళ్లు, నాలుక, ముట్టె లోపలి ప్రాంతాల్లో బొబ్బలు ఏర్పడతాయి. అవి 24 గంటల్లో చితికి పోవడం వల్ల పశువులు నొప్పితో మేత తినవు. నోటి నుంచి చొంగ కారుతుంది.
- చూడి పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయి. పొదుగుపై బొబ్బలు ఏర్పడి ఒక్కొక్కసారి పొదుగువాపు సంభవిస్తుంది. పశువులు శ్వాసను కష్టంగా పీల్చుతూ, రొప్పుతూ ఎండవేడిమికి తట్టుకోలేక నీరసిస్తాయి.

వ్యాప్తి చెందే విధానం

నోరు, కాలు వ్యాధికి గురైన పశువుల అంతస్రావాల (లాలాజలం, పుండ్ల నుంచి కారే రసి) వల్ల మిగతా పశువులకు వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉంది. వ్యాధికారక క్రిమి ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి గాలి ద్వారా వ్యాప్తి చెందుతుంది. గాలిలో తేమ శాతం అధికంగా ఉన్నప్పుడు దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. సంకరజాతి పశువులు త్వరగా ఈ వ్యాధి బారిన పడతాయి.

నివారణ ఇలా..

పశువులు బాగా బలహీనంగా ఉంటే గ్లూకోజ్ రక్తంలోకి ఇవ్వాల్సి ఉంటుంది. నోటిలో పుండ్ల వలన మేత మేయవు కనుక వాటికి సులభంగా జీర్ణమయ్యే పోషక పదార్థాలతో కూడిన ఆహారం అందించాలి. జావ, జొన్న, అన్నం, బెల్లంతో కలిపి ప్రతిరోజూ తాగించడం ద్వారా బలహీన పడకుండా జాగ్రత్త వహించాలి. ఈ వ్యాధి సోకిన పశువులను వేరు చేయాలి. వాటి మలమూత్రాలను గడ్డిలో కాల్చివేయాలి. చనిపోయిన పశువులను సున్నపు గోతిలో పూడ్చాలి. ఆబోతులు, దున్నల వీర్యం ద్వారా కూడా వ్యాధి వ్యాపిస్తుంది. అందువల్ల వ్యాధి సోకిన వాటిని సుమారు మూడు నెలల వరకు సంపర్కానికి వినియోగించకూడదు. కాలిగిట్టల మధ్య పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావణాలతో కడిగి నీమ్‌లెంట్, వేపనూనె పూయాలి. నోటిలోని పుండ్లకు బోరిక్ పౌడర్ చల్లి గ్లిజరిన్ కలిపి రాయాలి. వైద్యుడిని సంప్రదించి అవసరమైన మందులు వాడాలి.

విద్యుత్ షాక్‌తో సెంట్రింగ్ కూలీ మృతి


శ్రీనివాస్ మృతదేహం

కపిలేశ్వరపురం: మండలంలోని టేకి గ్రామానికి చెందిన సెంట్రింగ్ కూలి వాసంశెట్టి శ్రీనివాస్ (30) పని ప్రదేశంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. శ్రీనివాస్ మరో ఇద్దరు కూలీలతో కలిసి మంగళవారం పడమర ఖండ్రిక గ్రామంలో ఇంటి శ్లాబ్ సెంట్రింగ్ పనికి వెళ్లాడు. శ్రీనివాస్ ఆ భవనం కింది నుంచి ఊసను పైకి లాగుతుండగా 11 కేవీ వైర్లకు తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన వి.శ్రీనివాస్, జి.శివకృష్ణలకు స్వల్పగాయాలయ్యాయి. ఇద్దరినీ తొలుత కపిలేశ్వరపురం సీహెచ్‌సీకి, తర్వాత రాజమహేంద్రపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాస్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అంగర ఎస్సై జి.హరీష్‌కుమార్ తెలిపారు.

మోటారు సైకిల్ ఢీకొని మహిళ..

పెరవలి: మోటారు సైకిల్ ఢీకొన్న ఘటనలో మహిళ మృతి చెందింది. ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. రావులపాలెం మండలం రావులపాడు గ్రామానికి చెందిన కొప్పిశెట్టి వెంకాయమ్మ (68) మంగళవారం ఉదయం రావులపాలెంలో ఆటో ఎక్కి పెరవలి మండలం కడింపాడు సెంటర్‌లో దిగింది. అక్కడ రోడ్డు దాటుతున్న ఆమెను తణుకు నుంచి రావులపాలెం వైపు వెళుతున్న మోటారు సైకిల్ వేగంగా ఢీకొంది. దీంతో వెంకాయమ్మ ఎగిరి రోడ్డుపై పడటంతో తలకు బలమైన గాయమైంది. ఆమెను వెంటనే తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స అందిస్తుండగా వెంకాయమ్మ మృతి చెందింది. మృతురాలి కుమారుడు కొప్పిశెట్టి వీరభద్రం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వ్యాన్ కింద పడి..

ముమ్మిడివరం: ఠానేల్లంక ప్రధాన రహదారిపై రాజుపాలెం వద్ద మంగళవారం కొబ్బరి డొక్కల లోడుతో వెళుతున్న వ్యాన్ కింద పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. కూనాలంకకు చెందిన కొప్పిశెట్టి గంగరాజు (45) మోటారు సైకిల్‌పై ముమ్మిడివరం వెళుతున్నాడు. రాజుపాలెం వద్ద ముమ్మిడివరం వైపు వెళుతున్న వ్యాన్‌ను తప్పించబోయి దాని కింద పడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గంగరాజుకు భార్య రాజేశ్వరి, ఒక కుమార్తె ఉన్నారు. ఎస్సై డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేటు బస్సు ఢీకొని..

గండేపల్లి: మల్లేపల్లికి చెందిన మడపాటి సూరిబాబు (34) తాళ్లూరు సమీపంలోని సామిల్లు వద్ద తాపీపనికి వెళ్లాడు. అక్కడ రోడ్డు పక్కన నిలుచున్న అతడిని విజయవాడ వైపు నుంచి విశాఖ వైపు వెళుతున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో సూరిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య రామలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గండేపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.1.15 లక్షల ఎరువుల సీజ్

అంబాజీపేట: నిబంధనలకు వ్యతిరేకంగా నిల్వ ఉంచిన రూ.1.15 లక్షల విలువైన 5.20 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేసినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రాజమహేంద్రవరం డీఎస్పీ ఎస్.తాతారావు, మండల వ్యవసాయ అధికారి కె.ధర్మప్రసాద్ తెలిపారు. మాచవరంలోని సుభాషణ్ ట్రేడర్స్ ఎరువుల దుకాణాన్ని రాజమహేంద్రవరానికి చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగ అధికారులతో కలిసి మండల వ్యవసాయ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రూ.1,15,370 విలువైన ఎరువులను సీజ్ చేశారు. తనిఖీలో డీసీటీవో ఎ.నవీన్ కుమార్, కానిస్టేబుల్ శివకుమార్, ఏఈఓ జాజెబ్ శాస్త్రి పాల్గొన్నారు.

ముగ్గురు దారి దోపిడీ దొంగల అరెస్టు


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకట నారాయణ

రామచంద్రపురం: కె.గంగవరం మండలం అద్దంపల్లి సమీపంలో ఈనెల 3న దారి దోపిడీకి పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ ఎం.వెంకట నారాయణ వెల్లడించారు. పట్టణంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ద్రాక్షారామకు చెందిన యండమూరి శ్రీనివాస్ ఈ నెల 3న తాను పనిచేస్తున్న నగల దుకాణాన్ని మూసివేసి సుమారు రాత్రి 11 సమయంలో తిరిగి ఇంటికి వెళుతున్నాడు. అద్దంపల్లి గ్రామం దేవాంగుల శ్మశాన వాటిక సమీపానికి వచ్చేసరికి ఇద్దరు వ్యక్తులు ఆటోలో వచ్చి అతడిని ఇనుప పైపుతో కొట్టి కళ్లలో కారం చల్లారు. సుమారుగా 10 గ్రాముల పాతబంగారం, సెల్‌ఫోన్ రూ.5 వేలు, షాపునకు సంబంధించిన రశీదులు, స్కూటర్‌తో పాటు సుమారు రూ.78 వేలు విలువైన వస్తువులు దోచుకుపోయారు. దొంగలకు మరో వ్యక్తి సాయం చేశాడు. ఈ మేరకు ఎస్పీ బి.కృష్ణారావు, డీఎస్పీ రఘువీర్ ఆదేశాల మేరకు సీఐ వెంకట నారాయణ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది కేసు నమోదు చేసి విచారణ వేగవంతం చేశారు. తాళ్లరేవు మండలం లచ్చిపాలెం ఏరియా బైపాస్ రోడ్డులో ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారిని తాళ్లరేవు మండలం గాడిమొగ గ్రామానికి చెందిన ఓలేటి సత్తిబాబు, సంగాడి రాజు, పత్తిగొంది గ్రామానికి చెందిన కళ్లేపల్లి ప్రసాద్‌గా గుర్తించారు.

పోలీసులపై దాడి చేసిన యువకులకు జైలు


విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ భవ్యకిశోర్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): మద్యం తాగి పోలీసులపై దాడి చేసిన ముగ్గురు యువకులు జైలు పాలయ్యారు. టూటౌన్ పోలీసుల విధులకు ఆటకం కలిగించడమే కాక, వారిపై చేతివాటం చూపించిన వారిని అదుపులోకి తీసుకుని కోర్టుకు తరలించారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు ఆ ముగ్గురు యువకులను జైలుకు పంపారు. ఆ వివరాలను సౌత్ జోన్ డీఎస్పీ భవ్యకిశోర్ మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈనెల 7వ తేదీ అర్ధరాత్రి రెండో పట్టణ పోలీసులు నాగబాబు, కాళి విధులు నిర్వర్తిస్తున్నారు. ఆ సమయంలో రాజానగరం మండలం పాత తుంగపాడుకు చెందిన కట్టుంగ హరీష్ (రౌడీ షీటర్), రాజమహేంద్రవరం రూరల్ రాజవోలుకు చెందిన కర్రి దుర్గా సూర్య ప్రసన్నకుమార్, ధవళేశ్వరానికి చెందిన ములపర్తి వినోద్‌కుమార్‌లు మద్యం తాగి గొడవ పడుతున్నారు. దీన్ని చూసిన నైట్‌బీట్ పోలీసులు నాగరాజు, కాళి వారి వద్దకు వెళ్లి ఆపతుండగా వారు పోలీసులపై దాడి చేశారు. దీంతో వారిపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఆదేశాల మేరకు సబ్ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్, పోలీసులు బృందం యువకుల కోసం గాలించారు. ఈస్ట్ రైల్వే స్టేషన్ వద్ద వారు ఉన్నారని సమాచారం తెలిసిన పోలీసులు ఆ ప్రాంతంలో దాడి చేసి ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు.

టెన్నికాయిట్ జట్లకు క్రీడాకారుల ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

దేవరపల్లి: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా టెన్నికాయిట్ సీనియర్ మహిళలు, పురుషుల జట్ల ఎంపిక పోటీలను మంగళవారం దేవరపల్లి మండలం రామన్నపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా మైదానంలో నిర్వహించారు. ఈ పోటీల్లో 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వారిలో మహిళల జట్టుకు గెడల హేమమాధురి, రాపాక సంస్కృతి, రాపాక సారిక, ఎస్‌కే లతీఫా, మిరియాల ప్రియదర్శిణి ఎంపికైనట్టు అసోసియేషన్ అధ్యక్షుడు గద్దే చంద్రశేఖర్ తెలిపారు. పురుషుల జట్టుకు బోయిన చంటిబాబు, గంగుల చంద్ర మహేష్, రాపాక నవీన్, మద్దాల అజయ్, గారపాటి బాబీలను ఎంపిక చేశామన్నారు. వీరు మండపేటలో ఈ నెల 13, 14 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన జట్లకు రెండు రోజుల పాటు స్థానిక జెడ్పీ హైస్కూల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు. క్రీడాకారులకు టెన్నీకాయిట్ జిల్లా అసోసియేషన్ చైర్మన్ గన్నమని హరికృష్ణ, వైస్ చైర్మన్ ఉప్పులూరి రాంబాబు క్రీడా దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో వాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్, దాపర్తి వెంకటేశ్వరరావు, 20 మంది పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

11 నుంచి పాఠశాల క్రీడా సమాఖ్య పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల క్రీడా సమాఖ్య అండర్–14, 17 క్రీడా పోటీల షెడ్యూలు ఖరారు అయినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ మంగళవారం తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని క్రీడాకారులకు జిల్లా క్రీడామైదానం (డీఎస్‌ఏ)లో ఎంపికలు జరుగుతాయన్నారు. ఈ ప్రకారం..

- అండర్ 14, 17 బాలబాలికల విభాగంలో ఈ నెల 11న ఆర్చరీ, ఘట్కా, సపక్ తక్రా పోటీల్లోనూ, ఈ నెల 15న సాఫ్ట్ టెన్నిస్, జుడో, రైఫిల్ షూటింగ్ పోటీలు, అండర్ 17 బాలురు, బాలికల విభాగంలో ఫుట్‌బాల్ పోటీలు జరుగుతాయి.
- 16న అండర్ 14, 17 బాలురు, బాలికల విభాగంలో టెన్నిస్, జిమ్నాస్టిక్స్ (అండర్–14, 17, 19), అండర్–17 బాలురు, బాలికల విభాగంలో వెయిట్ లిఫ్టింగ్ ఎంపికలు నిర్వహిస్తారు.
- 17న అండర్ 14, 17, బాలురు, బాలికలకు టేబుల్ టెన్నిస్, రగ్బీ, పీఆర్‌జీ హైస్కూల్లో నెట్‌బాల్ ఎంపికలు, 18న అండర్ 14 17 విభాగంలో స్విమ్మింగ్, రెజ్లింగ్, స్క్వాష్ ఎంపికలు జరుగుతాయి.
- 19న అండర్ 17 బాలురు, బాలికల మోడ్రన్ పెంటథలాన్, అండర్ 14, 17 బాలురు, బాలికల సైక్లింగ్, రోడ్ ట్రాక్ పోటీలు డీఎస్‌ఏ మైదానంలో నిర్వహిస్తారు. స్కేటింగ్, తంగట, బాక్సింగ్‌లు రాజమహేంద్రవరం ఎస్‌కేవీటి పాఠశాలలోనూ, బీచ్ వాలీబాల్ పోటీలు కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లోను నిర్వహిస్తారు. అండర్ 14 ఫుట్‌బాల్ బాలురు, బాలికల ఎంపికలు, అండర్ 14, 17 తైక్వాండో, కురాష్, ఉషు, కరాటే పోటీలను రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ పాఠశాల, మాల్కంబ్ పోటీలను జెడ్పీహెచ్ఎస్ గుడిమిలంక, కోనసీమ జిల్లాలో జరుగుతాయి. వివరాలకు 96035 04347 నంబర్‌ను సంప్రదించాలి.

పీడీలు లేని కాలేజీలపై చర్యలు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న కాలేజీలలో ఫిజికల్ డైరెక్టర్లు (పీడీ) తప్పనిసరిగా ఉండాలని, లేని కాలేజీలపై తగిన చర్యలు తప్పవని వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ హెచ్చరించారు. అలాగే యూనివర్సిటీ పరంగా నిర్వహించే కార్యక్రమాలకు గైర్హాజరయ్యే కాలేజీలపై కూడా చర్యలు తీసుకుంటాయన్నారు. యూనివర్సిటీ సెమినార్ హాలులో మంగళవారం స్పోర్ట్సు బోర్డు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనుబంధ కాలేజీలు సుమారు 400 వరకు ఉండగా, వాటిలో చాలావరకు పీడీలు లేకపోవడం విచారకరమన్నారు. విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడంతోపాటు పోటీలలో పాల్గొనే విధంగా అవసరమైన తర్ఫీదునివ్వడంలో పీడీల పాత్ర విశిష్టమైనదన్నారు. ప్రతి కాలేజీలోను పీడీ ఉండాలని, మైదానంలో క్రీడా పోటీలు జరుగుతూ ఉండాలన్నారు. ఇక నుంచి ఆల్ ఇండియా, సౌత్ జోన్ క్రీడా పోటీలలో పాల్గొని, ఎక్కువ పతకాలు తీసుకువచ్చిన కాలేజీకి రూ.10 వేలు నగదు బహుమతి, పీడీకి గౌరవ పురస్కారాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే, సీడీసీ డీన్ డాక్టర్ ఎ.మట్టారెడ్డి, పీఈడీ అధ్యాపకులు, పీడీలు పాల్గొన్నారు.

క్లోరిన్ గ్యాస్ లీకై పలువురికి అస్వస్థత

యానాం: కనకాలపేట రక్షిత తాగునీటి పథకం ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో మంగళవారం సాయంత్రం క్లోరిన్ గ్యాస్ లీక్ కావడంతో పలువురు అస్వస్థతకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే.. పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పీడబ్ల్యూడీ) ఆధ్వర్యంలో కనకాలపేటలోని ట్రీట్‌మెంట్ ప్లాంట్ నుంచి పలు గ్రామాలకు తాగునీరు అందిస్తుంటారు. ఈ నీటిని శుభ్రపరిచేందుకు సుమారు 900 కేజీల క్లోరిన్ గ్యాస్ సిలిండర్‌ను ప్రతి మూడు నెలలకు ఒక్కసారి మార్చాలి. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం సిబ్బంది సిలిండర్‌ను మార్చుతుండగా ఒక్కసారిగా దానిలోంచి గ్యాస్ లీకై బయటకు వ్యాపించింది. దీంతో అక్కడే ఉన్న సుమారు తొమ్మిది మంది సిబ్బంది బయటకు పరుగులు తీశారు. కనకాలపేటలోని కోనవారివీధి,


క్లోరిన్ గ్యాస్‌ను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పాతబడివీధి, జమ్మిబాడువ తదితర గ్రామాల్లోకి గ్యాస్ వ్యాపించడంతో దాని వాసనకు పలువురు అస్వస్థతకు గురయ్యారు. ఊపిరి పీల్చుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పీడబ్ల్యూడీ ఈఈ నాగరాజు ఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. అనంతరం నాగరాజు, జేఈ పెదపాటి సంతోష్, గ్యాస్ లీకేజీని అరికట్టేందుకు వచ్చిన ఫైర్‌మన్


జీజీహెచ్‌లో బాధితులకు చికిత్స అందిస్తున్న వైద్యులు

కోన కృష్ణారావు (బాబీ) తదితర తొమ్మిది మంది సిబ్బందితో పాటు 18 మంది గ్రామస్తులు అస్వస్థతకు గురయ్యారు. వారిని జీజీహెచ్‌కు తరలించారు. ఆస్పత్రిలో బాధితులను ఎమ్మెల్యే అశోక్, ఆర్ఏవో అంకిత్ కుమార్ పరామర్శించారు. గ్యాస్‌లీక్‌ను అగ్నిమాపక సిబ్బంది అదుపులోకి తీసుకురావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.